# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 13-11-2024 | సంపుటి : 06 | సంచిక : 46 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## నవంబరు 17న తిరుమలలో కార్తీక వనభోజనం

తిరుమల,కార్తీక వనభోజన కార్యక్రమం నవంబరు 17వ తేదీన ఆదివారం తిరుమలలోని గోగర్భం సమీపంలో గల పార్వేటమండపంలో జరుగనుంది. ఉదయం 8.30 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు చిన్న గజ వాహనంపై, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు పల్లకీపై ఆలయం నుంచి ఊరేగింపుగా బయల్దేరి ఉదయం 10 గంటలకు పార్వేటమండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపనతిరుమంజనం నిర్వహిసారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. ఆ తరువాత కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తారు. పవిత్రమైన కార్తీకమాసంలో వనభోజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


# కాంగ్రెస్ ఎప్పటికీ ఆ తరగతులను ఎదగనీయదు



చిమూర్: కాంగ్రెస్ పార్టీ ఏరోజూ వెనుకబడిన తరగతులను పట్టించుకున్న పాపాన పోలేదని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులు, వెనుకబడిన తరగతుల వారు ఎదగడానికి దోహదపడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ) అన్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా చిమూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడుతూ, ఇండియాను పరిపాలించడానికి తాము పుట్టినట్టు ఆ రాజకుటుంబం అనుకుంటుందని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ఆ కారణంగానే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దళితులు, వెనుకబడిన తరగుతులు, ఆదివాసీలు ఎదగకుండా చేసిందని అన్నారు. రాజీవ్ గాంధీ నాయకత్వంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఒక అడ్వర్‌టైజ్‌మెంట్‌ను మోదీ ప్రస్తావిస్తూ, అది ఆ పార్టీ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరిని ప్రతిబింబిస్తుందని చెప్పారు. దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలకు ప్రత్యేక హక్కులను ప్రశ్నించేలా ఆ ప్రకటన ఉందని చెప్పారు. కశ్మీర్‌లో 370వ అధికరణను రద్దు చేయడంపై మాట్లాడుతూ, యావద్దేశానికి ఒకే రాజ్యాంగం అమలు కావడానికి ఏడు దశాబ్దాలు పట్టిందన్నారు. కశ్మీర్‌లో 370వ అధికరణను పునరుద్ధరించడానికి మీరు అంగీకరిస్తారా అని సభికులను ఉద్దేశించి ప్రధాని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో మహారాష్ట్ర అభివృద్ధికి భరోసా ఇస్తుందన్నారు. మహారాష్ట్రలోని మహాయుతి కూటమి, కేంద్రంలోని బీజేపీ-ఎన్డీయే కూటమితో కలిసి రెట్టింపు స్పీడుతో మహారాష్ట్రను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తుందని హామీ ఇచ్చారు. గత 2.5 ఏళ్లలో డబుల్ స్పీడ్ డవలప్‌మెంట్‌ను ప్రజలు చూసారని, గరిష్ట పెట్టుబడులు మహారాష్ట్ర వచ్చాయని చెప్పారు. కొత్త విమానాశ్రయాలు, ఎక్స్‌ప్రెస్‌వేలు వచ్చాయని, డజను వందే భారత్ రైళు నడుస్తున్నాయని, 100 రైల్లే స్టేషన్లను ఆధునీకరించామని తెలిపారు. అందరూ ఒకటిగా కలిసుంటేనే క్షేమంగా ఉంటామని మరోసారి మోదీ తన నినాదాన్ని వినిపించారు. దేశంలో గిరిజన జనాభా సుమారు 10 శాతం ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ కమ్యూనిటీని కులాల పేరుతో విడగొట్టి బలహీనపరచాలని అనుకుంటోందని చెప్పారు. అంతర్గత పోరుతో గిరిజనుల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం ఆ పార్టీ చేస్తోందన్నారు. అదే జరిగితే గిరిజనుల ఐక్యత దెబ్బతింటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రిన్స్ (రాహుల్) ఇదే విషయాన్ని విదేశంలో ప్రకటించారని, కాంగ్రెస్ కుట్రలో మనం భాగం కారాదని, కలిసికట్టుగా ఉండాలని మోదీ పిలుపునిచ్చారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నవంబర్ 20న జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి.

# వాళ్లకు బాధ్యత లేదు.. కానీ మనకు ఉంది..

## ఎమ్మెల్యేలతో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



సభలో ప్రతిపక్షం లేదు కదా.. మనకేం ఉందని నిర్లక్ష్యంగా ఉండొద్దని కూటమి ఎమ్మెల్యేలకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వాళ్లకు బాధ్యత లేదు కానీ.. మనకు ఉందని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దామని సూచించారు. ఎమ్మెల్యేలకు సబ్జెక్ట్ చేర్చుకోవాలనే ఆసక్తి తగ్గిపోతుందని చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు నిరంతరం నేర్చుకోవాలని, తెలుసుకోవాలని సూచించారు. బడ్జెట్ సమావేశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ప్రభుత్వం తెచ్చే బిల్లులు, పాలసీలపై అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంతో పాటు కేంద్ర బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులపై ఎమ్మెల్యేలు స్టడీ చేయాలని సూచించారు. పబ్లిక్ గవర్నెన్స్‌లో ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండాలని చెప్పారు. విజన్ 2047పై అందరి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పనిచేయాలనే ఆసక్తి ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలకు ఏం అవసరం.. మనం ఏం చేశామనేది చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అసెంబ్లీలో తమ ప్రతినిధి మాట్లాడుతున్నారని ప్రజలు గమనిస్తూనే ఉంటారని తెలిపారు. అలాంటప్పుడు బూతులు మాట్లాడితే ప్రజలు స్వాగతించరని చెప్పారు.

# చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా భయపడం..

## మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు

సోషల్‌మీడియా కార్యకర్తలకు వైసీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఆనాడు ఎమ్మెల్యేలను లాగేసుకుని వైఎస్ జగన్‌ను ఒంటరి చేయాలనే ప్రయత్నం చేసి చంద్రబాబు భంగపడ్డారని అన్నారు. ఇప్పుడు మళ్లీ వైసీపీ సోషల్‌మీడియాను బయపెట్టాలని కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు మళ్లీ భంగపాటు తప్పదని చెప్పారు. చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా సరే వైసీపీ కార్యకర్తలు భయపడరని స్పష్టం చేశారు. గుంటూరు జైలులో ఉన్న వైసీపీ సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌లు మేక వెంకట్రామిరెడ్డి, కళ్లం హరికృష్ణ రెడ్డి, పానుగంటి చైతన్యను పేర్ని నాని, ఎమ్మెల్యే లేళ్ల అప్పిరెడ్డితో కలిసి అంబటి రాంబాబు పరామర్శించారు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. వర్రా సుధారాణి దంపతులను పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. మహిళ అని కూడా చూడకుండా పోలీసులు టార్చర్ చేస్తున్నారని మండిపడ్డారు. వర్రా రవీందర్ రెడ్డిని అర్ధరాత్రి ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. ముసుగు వేసి మీడియా ముందు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఏపీలో పౌర హక్కులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ కుటుంబసభ్యులపై ఐటీడీపీ సోషల్‌మీడియాలో చాలా దారుణంగా పోస్టులు పెడుతున్నారని అంబటి రాంబాబు మండిపడ్డారు. వాటిపై వైసీపీ నేతలు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ వాళ్లే ఫేక్ అకౌంట్లతో అక్రమ పోస్టింగ్‌లు పెడుతున్నారని తెలిపారు. పోలీసులు అక్రమంగా నిర్బంధించి వైఎస్ జగన్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లు చెప్పమని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. చట్టాన్ని పాటించకపోతే సర్వనాశనమవుతారని హెచ్చరించారు. వైసీపీ సోషల్‌మీడియా కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఇదే విషయమై తొందరలోనే సుప్రీంకోర్టు, రాష్ట్ర గవర్నర్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు.




# అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామాలు చేయండి.. వైసీపీ ఎమ్మెల్యేలకు షర్మిల లేఖ

అమరావతి : ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వైసీపీ అధినేతకు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఘాటుకు లేఖ రాశారు. అసెంబ్లీకి వెళ్లలేని ఎమ్మెల్యేలు తక్షణమే పదవులకు రాజీనామా చేయాలని మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిమాండ్ చేస్తూ లేఖను విడుదల చేశారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలను గమనించే ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి వెళ్లనని జగన్ చెబుతున్నారు. స్వయంకృతాపరాధమేతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని గుర్తించాలని సూచించారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చిన కృతజ్ఞతనైనా ఉండాలి కదా అంటూ నిలదీశారు. అసెంబ్లీకి వెళ్లనని జగన్ అహంకారం, అజ్ఞానం బయట పడుతుందని ఆరోపించారు. బయట మాట్లాడుతాం. ఇంట్లో కూర్చుని మాట్లాడతం అంటే సరిపోదని , అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని వైసీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. అసెంబ్లీ పోవడానికి ధైర్యం లేదా. సామర్థ్యం లేదా జగన్ సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి పోటీకి నిలబడితే అసెంబ్లీకి వెళ్లమని , గెలిపించినా అసెంబ్లీకి వెళ్లబోమని ప్రజల నుంచి రిఫరెండం తీసుకోవాలని అన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. అసెంబ్లీకి వెళ్లకపోతే ప్రజలను మోసం చేయడం కాదా అంటూ ప్రశ్నించారు.



# దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలి

## -కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్: కేంద్రీయ విద్యాలయాలు శక్తివంతమైన మినీ ఇండియా లాంటివని, ప్రతీ పాఠశాల భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబిం బంగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిఅన్నారు. తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్రీయ ఏక్తా పర్వ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాతికేళ్లలో భారత్‌ను విశ్వగురుగా తీర్చిదిద్దే సవాల్‌ను స్వీకరించాలని, యువత ఈ దిశగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఏక్ భారత్ శ్రేష్ట్ కార్యక్రమం కింద భిన్న సంస్కృతులను ఏకం చేసే కృషి జరుగుతుందని చెప్పారు. రాష్ట్రీయ ఏక్తా పర్వ్ లాంటి కార్యక్రమాలు దేశాన్ని సాంస్కృతికంగా ఏకం చేయడానికి దోహదం చేస్తాయన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఈటల రాజేందర్‌మాట్లాడుతూ.. 75 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కూడా దేశంలో సాంస్కృతిక సమగ్రత పటిష్ఠంగా ఉందన్నారు. దేశ యువశక్తిని నైపుణ్యాలతో సుసంపన్నం చేయడానికి ఇలాంటి ఉత్సవాలు దోహదపడతాయన్నారు. దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక చరిత్రను ప్రతిబింబించే కళలు, ఆచార వ్యహారాలను ప్రతిబింబించే స్టాళ్లను ఆయా రాష్ట్రాల విద్యార్థులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ నిధి పాండే, హైదరాబాద్ రీజన్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ సహాయ కమిషనర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 18న తిరుపతిలో కార్తీక దీపోత్సవం

తిరుపతి : పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరగనున్న ఈ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈనెల 15న తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో పౌర్ణమి గరుడసేవను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విధితమే.


# మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్.. షెడ్యూల్ ఇదే!



అమరావతి : ఏపీ రాజకీయాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ దూసుకెళున్నారు. జగన్‌ను ఓడించాలనే పట్టుదలతో టీడీపీ, బీజేపీలను ఒక కూటమిగా ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. వైసీపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా చూడాలని లక్ష్యంతో అందర్నీ ఒక్కతాటిపైకి తెచ్చి సంచలన విజయం సాధించారు. అలాగే 100 పర్సెంట్ స్ట్రైక్ రేటుతో తన పార్టీని కూడా గెలిపించుకున్నారు. దీంతో పవన్ కల్యాణ్ క్రేజ్ ఏంటో జాతీయ స్థాయిలో అందరికీ అర్థమైంది. ఇప్పుడు అదే క్రేజ్‌ను ప్రధాని మోదీ ఉపయోగించుకోవాలని ప్లాన్ చేసింది. చేస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే తరపున ప్రచారం చేయించాలని నిర్ణయించింది. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ హోరాహోరీగా తలపడుతున్నాయి. అయితే మహావికాస్ అఘాడీని ఎదురించి ఎలాగైనా తమ అధికారాన్ని కాపాడుకోవాలని ఎన్డీయే కూటమి ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఏపీ ఎన్నికల్లో 100 పర్సెంట్ స్ట్రైక్ రేటుతో సంచలనం సృష్టించిన పవన్ కల్యాణ్‌ను బీజేపీ కూటమి తరపున ప్రచారానికి దించాలని ప్లాన్ చేసింది. ఇదే విషయమై పవన్ కల్యాణ్‌ను బీజేపీ అధిష్ఠానం సంప్రదిస్తే ఓకే కూడా చెప్పేశారు. దీని ప్రకారం నవంబర్ 16, 17వ తేదీల్లో పవన్ కల్యాణ్ మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్నారు. ముఖ్యంగా మహారాష్ట్రలో తెలుగు ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ పర్యటన ఉండనున్నట్లు తెలుస్తోంది. తెలుగు ప్రజల్లో పవన్ కల్యాణ్‌కు ఉన్న క్రేజ్‌ను వాడుకుని అక్కడ ఓట్లు రాబట్టుకునేందుకు ప్లాన్ చేసింది. ఇది కాకుండా ఇటీవల తిరుమల లడ్డూ వివాదం సమయంలో సనాతన ధర్మం పరిరక్షణ కోసం ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. ఇది కూడా తమకు ప్లస్ అవుతుందని బీజేపీ భావించింది. అందుకే పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దించుతున్నది.

## ఏపీలో ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియను పొడిగించారు. నిన్నటి వరకు చివరి గడువు ఉండగా దీనిని



ఈనెల 21వ తేదీవరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతిక శుక్లా ప్రకటన జారీ చేశారు. డిసెంబర్ 5వ తేదీ వరకు రూ.100 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. మొదటి , రెండో ఏడాది చదివే విద్యార్థులు జనరల్ థియరీ సబ్జెక్టులకు రూ. 600, సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలకు రూ. 275, బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు రూ. 165 చొప్పున ఫీజు చెల్లించాలని సూచించారు. మొదటి, రెండో ఏడాదికి కలిపి థియరీ పరీక్షలకు రూ. 1200 చెల్లించాలని పేర్కొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 13-11-2024

## వలసల విధానంపై పిడుగేనా

అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఇంకా గద్దెనెక్కక ముందే.. శ్వేతసౌధంలోకి అడుగు పెట్టకముందే.. వలస విధానంలో సంచలనం చోటు చేసుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఏడాది జూన్‌లో 'కుటుంబాలను కలిపి ఉంచడం'(కీపింగ్ ఫ్యామిలీస్ టుగెదర్) అనే నూతన వలస విధానాన్ని తీసుకువచ్చారు. దీని ద్వారా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరులు తమ కుటుంబ సభ్యులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోయినా.. చట్టబద్ధత పొందే వీలు కల్పించారు. అయితే.. ఈ విధానాన్ని తాజాగా గతంలో డొనాల్డ్ ట్రంప్ నామినేటెడ్ చేసిన టెక్సా?సలోని జిల్లా జడ్జి జస్టిస్ జె. కాంప్‌బెల్ బార్కర్ నిలుపుదల చేశారు."ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఫెడరల్ ఏజెన్సీలకు చట్టబద్ధత లేదు" అని తీర్పు వెలువరించారు. దీంతో నూతన విధానానికి అర్హులైన సుమారు 5లక్షల మంది పౌరులపై పిడుగు పడినట్టయింది. ట్రంప్ అప్రతిహత విజయం దక్కించుకున్న కొన్ని గంటల్లోనే ఆయన నామినేట్ చేసిన జడ్జి తీర్పు వెలువరించడం చర్చకు దారితీసింది. అక్రమ వలస దారులను దేశం నుంచి పంపేస్తానని ఎన్నికల సమయంలో ట్రంప్ పదే పదే చెప్పిన విషయం తెలిసిందే. టెక్సాస్ కోర్టు తాజా తీర్పుపై 'అమెరికన్ ఫ్యామిలీస్ యునైటెడ్' సంఘం అధ్యక్షుడు ఆష్లే డీ అజెవెడో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్పు లక్షల మంది ఆశలను ఛిద్రం చేసిందన్నారు.మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ (తిరువనంతపురం) సర్వే ప్రకారం 2023లో కేరళ నుంచి విదేశాలకు ఉన్నత చదువులకోసం 2.5 లక్షల మంది విద్యార్థులు వలస వెళ్లారు. దేశం మొత్తం మీద విదేశాలకు వెళ్లిన మొత్తం విద్యార్థుల సంఖ్యలో కేరళ విద్యార్థుల సంఖ్యే 20% వరకు ఉంటోందని తేలింది. కేరళ నుంచి ఇంత భారీ ఎత్తున విద్యార్థులు వలస వెళ్లడానికి దారి తీసే పరిస్థితులు ఏమిటి? ఈ విధమైన పరిస్థితి కేరళ రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక అంశాలపై విపరీత ప్రభావం చూపిస్తుంది. ఏ దేశంలో ఉపాధికి, ఉద్యోగాలకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయో, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కడ ప్రోత్సాహకర వాతావరణం ఉంటుందో అక్కడకు ప్రజలు వలస వెళ్లడం సహజం. అలాగే విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు భారీ ఎత్తున అవకాశాలు ఉంటున్నందున విద్యార్థుల వలస విశేష సంఖ్యలో కొనసాగుతోంది.కేరళలో విద్యావంతులు ఎక్కువే. నిరుద్యోగమూ ఎక్కువే. ఉద్యోగాలను ఆశిస్తూ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజిల్లో 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి సంఖ్య 29 లక్షలు దాటింది. వీరిలో ఎస్‌ఎస్‌ఎల్‌సి లేదా అంతకన్నా ఎక్కువ చదువుకున్న వారి సంఖ్య 23 లక్షల వరకు ఉంది. సాంకేతికంగా అర్హత కలిగిన వారు 3.5 లక్షలకు పైబడి ఉన్నారు. దీనికి తోడు యూనివర్శిటీల చదువులు పూర్తి చేసుకుని ఏటా లేబర్ మార్కెట్‌లోకి చేరుతున్న వారి సంఖ్య మరో లక్ష వరకు ఉంటోంది. మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వారి సంఖ్య 20 లక్షలు దాటింది. అలాంటి గెస్ట్ వర్కర్లు ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటారు. కానీ నిరుద్యోగులైన విద్యావంతులు మాత్రం ఏపని అయినా చేయడానికి సిద్ధంగా ఉండరు. వీరు తమ సామాజిక హోదాకు తగ్గట్టు ఎక్కువ వేతనం అందించే సుస్థిరమైన ఉద్యోగాలను ఆకాంక్షిస్తుంటారు. అయితే అలాంటి ఉద్యోగాలు చాలా తక్కువగా ఉండటంతో నిరుద్యోగులు అలాగే ఉండిపోతున్నారు. మొత్తం మీద వలస విద్యార్థులు ముఖ్యంగా అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్లడానికి ముందు వరుసలో ఉండడం పరిపాటి. ఈ దేశాల్లో ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీగా లభించే అవకాశాలు పుష్కలంగా ఉండడమే ఈ ఆకర్షణకు కారణం.కేరళలో ఇచ్చే వేతనం కన్నా అనేక రెట్లు వేతనం విదేశాల్లో ఇస్తున్నారు. ఉదాహరణకు అమెరికాలో పనిచేసే ఒక నర్సు నెలకు రూ. 4,00,000 వరకు సంపాదిస్తోంది. దీనికి తోడు విలాసవంతమైన నివాసం, కార్లు, అత్యంత ఆధునికమైన పరికరాల వినియోగం కేరళలో ఉండే తమ తల్లిదండ్రులకు అందేలా చేస్తోంది. విదేశాల్లో ఈ విధంగా సంపాదించే వేతనాల్లో కనీసం పదోవంతైనా కేరళలోని నర్సుకు దక్కడం లేదు. కలలోనైనా అలాంటి విలాస జీవనం ఊహించే అవకాశం కలగదు. నర్సులే కాదు, దాదాపు అన్ని కేటగిరీలకు చెందిన వర్కర్లు కేరళలో తమ వేతనాలతో అలాంటి విలాసవంత జీవితాన్ని కలగనడానికైనా అవకాశమే ఉండదు. వలస వెళ్లిన వారి కుటుంబాలు కేరళలో అత్యంత విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. ఈ కుటుంబాల యువకులు, కుర్రాళ్లు సాధారణంగా తమకు తాము విలాసవంతమైన జీవితాన్నే కోరుకుంటారు. అలాంటి బంగారు స్వప్నాలు వారిని విదేశాలకు వెళ్లి చదువుకోడానికి, అక్కడే ఉద్యోగాలు చేయడానికి దోహదం చేస్తున్నాయి. అయితే చాలా మందికి విదేశాలకు వలస వెళ్లడం పూలబాట కాకపోవచ్చు. అమెరికా ఇటీవల తీసుకున్న నిర్ణయం భారతీయ కుటుంబాలకు చెందిన వేలాదిమంది పిల్లల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంగా ఉంటోంది. చిన్నవయసులో తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చినవారు అక్కడే పెరిగి, చదువులు పూర్తి చేసుకుని తమకు 21 ఏళు రాగానే అమెరికా ప్రభుత్వం వారిని స్వదేశానికి దయచేయండి అని చెప్పడం వివాదాస్పదంగా తయారైంది. ఇక తెలుగు రాష్ట్రాల విద్యార్థుల పరిస్థితిని పరిశీలిస్తే అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో 12.5 శాతం మంది ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలకు చెందిన తెలుగువారే ఉన్నారు. అందువల్ల ఎవరైనా తెలుగు రాష్ట్రాల నుంచి కొత్తగా అమెరికాకు వస్తే తమ చుట్టూ తెలుగువారే ఎక్కువగా కనిపిస్తుండటంతో వారు విదేశాల్లో ఉన్నామన్న భావన కన్నా స్వంత రాష్ట్రాల్లోనే ఉన్నామన్న అనుభూతి కలుగుతోంది.అమెరికాలో తెలుగు మాట్లాడే జనాభా 2016లో 3,20,000 నుండి 2024 1.23 మిలియన్‌కు పెరిగింది. అమెరికా సెన్సస్ బ్యూరో డేటా ఆధారంగా కాలిఫోర్నియాలో అత్యధికంగా తెలుగు మాట్లాడే జనాభా దాదాపు 2,00,000 వరకు ఉంది. ఇప్పుడు అమెరికాలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో 11 వ స్థానంలో తెలుగు ఉంది.

# ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించండి---


### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా---

విభారె న్యూస్ నంద్యాల బ్యూరో నవంబర్ 12-జిల్లాలోని 86 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వసతి గృహాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ఎస్సీ, బిసి రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, గురుకులాల అధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పిల్లలను చదివించేందుకు పంపిస్తున్నారని వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, మంచి అలవాట్లపై అవగాహన కల్పించడం, విద్యాబుద్ధులు నేర్పించడంపై సంక్షేమ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గతంలో తాను కొన్ని వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశానని అపరిశుభ్ర వాతావరణం, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు లేకపోవడం, టాయిలెట్లు పరిశుభ్రంగా లేకపోవడం, కొన్ని చోట్ల టాయిలెట్లే లేకపోవడం గమనించానని అన్నారు ..ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బిసి వెల్ఫేర్ అధికారి ముస్తక్ అహమ్మద్, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్, బిసి రెసిడెన్షియల్ వెల్ఫేర్ కన్వీనర్ ఫ్లోరా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, అన్ని ప్రభుత్వ వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ

### -పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు


### నేడు ఆయన వర్ధంతి



తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమ ప్రతిధ్వని కాళోజి నారాయణరావు. రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం కాళోజి. కవిత్వం వ్రాసిన ప్రజాకవి, హక్కులడిగిన ప్రజల మనిషి, ఉద్యమం నడిపిన ప్రజావాది, మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి కాళోజి. పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు.తెలంగాణ తొలిపొద్దు కాళోజీ. 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి-అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు 1914, సెప్టెంబరు 9 న కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయితగా ప్రఖ్యాతిగాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపుకడతాయి. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్లా పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీ లోనూ, హన్మకొండ లోని కాలేజియేట్ హైస్కూలు లోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదు లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న లా కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయోద్యమంలో ఎంతో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయరానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు , సురవరం ప్రతాపరెడ్డి , జమలాపురం కేశవరావు , బూర్గుల రామకృష్ణారావు , పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింపజేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్యసాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయనకు నగర బహిష్కరణశిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూరు విశ్వవిద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికయ్యాడు. కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించారు. కాళోజి న్యాయవాద విద్య అభ్యసించినా వృత్తి ముందుకు సాగలేదు. కవిత్వం రాసినా ప్రజా చైతన్య మార్గమే ఆయన లక్ష్యం. రాజకీయాలు ఆయన ప్రాణం. కాళోజి రామేశ్వరరావు ఆయన అన్న, ఉర్దూ కవి. తమ్ముడికన్నా అన్న ఆరు సంవత్సరాలు పెద్ద. కాళోజీ అసలు పేరు-రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రాం రాజా కాళోజి- తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడపడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు.

## భారీగా తగ్గిన నాన్ వెజ్

హైదరాబాద్, నవంబర్ 12, (న్యూస్ పల్స్) నాన్ వెజ్ ప్రియులకు సండే మండేతో తేడా లేదు. ఎప్పుడు పెట్టినా నాన్ వెజ్ లాగించేస్తారు. కానీ ధరలు ఎక్కువ ఉంటే మాత్రం కాస్త ఆలోచించక తప్పదు. అలాంటప్పుడు వారానికి ఒకటి రెండు సార్లు మాత్రమే తినగలరు. కానీ ధర తక్కువ ఉంటే వారికి పండగే అని చెప్పాలి. తినాలి అనిపించడమే



ఆలస్యం తెచ్చుకుని వండుకోవడమే.అయితే అలాంటి నాన్ వెజ్ ప్రియులకు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి. కార్తీకమాసం కావడంతో చాలా మంది నాన్ వెజ్ కు దూరంగా ఉంటారు. ప్రతి ఇంట్లోనూ పూజలు చేస్తుంటారు. దేవుడిని ఆరాధిస్తూ చాలా పవిత్రంగా ఉంటారు. దీంతో చికెన్ ధరలు భారీగా తగ్గబోతున్నట్టు సమాచారం అందుతోంది. రెండు వారాల క్రితం చికెన్ ధరలు భారీగా ఉన్నాయి. స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.270 నుండి రూ.300ల మధ్య ఉంది.కాగా ప్రస్తుతం ధరలు చాలా వరకు తగ్గిపోయాయి. చాలా పట్టణాలలో కేజీ చికెన్ రూ.180 నుండి 200 మాత్రమే ఉంది. అంతే వంద నుండి 70 రూపాయాల వరకు తగ్గిపోయింది. అయితే చికెన్ కు డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం ధరలు అలాగే కొనసాగుతున్నాయి. ఇక ఈ నెల చికెన్ ధరలు మరింత తగ్గుతాయని మార్కెట్ వర్గాలలో చర్చ జరుగుతోంది. అంతే కాకుండా డిసెంబర్ నెలలో తిరిగి ధరలు పుంజుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ




---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 12-డీఎస్సీ 2024 ఉచిత శిక్షణ నిమిత్తము నవంబర్ 14 వ తేదీ లోపు దరఖాస్తుచేసుకోవాలని నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి. ముస్తాక్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు.ఆసక్తి కలిగిన వారు నవంబర్ 16వ తేదీ నుంచి రెండు నెలల పాటు ఉచిత శిక్షణఇవ్వబడునని అన్నారు . శిక్షణతో పాటు స్టైఫండ్ అభ్యసన సామాగ్రి ఇవ్వనునట్లు తెలిపారు. అర్హులైనబిసి,ఎస్సి,ఎస్టిమరియు మైనారిటీ విద్యార్థులు తమ బయో డేటా తో పాటు పదో తరగతిఇంటర్ డిగ్రీ, బి.ఎడ్, టిటిసి, ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. తల్లి,తండ్రులవార్షిక ఆదాయము లక్షలోపు వుండవలెనని ఆయన అన్నారు .టెట్ నందు అర్హత సాధించిన వారు మాత్రమేధరఖాస్తు చేసుకొనవలెను. పూర్తి వివరాలకు 9989003020 పోన్ చేయవచ్చని తెలిపారు.

## ఆశ్రమాల్లోని వృద్ధులకు అండగా నిలవాలి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-నవంబర్ 12 సొంతవారి ప్రేమకు దూరమై వృద్ధాశ్రమాల్లో, అనాథ ఆశ్రమాల్లో తల దాచుకుంటున్న వృద్ధులకు నేటి తరం యువత అండగా నిలవాలని, సేవ అనేది ఆత్మ సంతృప్తిని ఇచ్చే ఉత్తమ మార్గమని స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు స్ఫూర్తి మధు అన్నారు. చలి కాలాన్ని దృష్టిలో వుంచుకొని స్థానిక సంస్థ ఆధ్వర్యంలో పద్మావతి వృద్ధాశ్రమం, ఓబులాపురం శ్రీ కాశీనాయన సేవాశ్రమం ఆశ్రమాల్లో చలికి ఇబ్బంది పడుతున్న వృద్ధులకు చలి కోట్లు అందించారు. ఈ చలి కోట్ల పంపిణీకి సాయం అందించిన అజ్ఞాత దాతకు స్ఫూర్తి సభ్యులు, వృద్ధులు ధన్యవాదములు తెలిపారు. సేవ చేయడం అనేది మంచి మార్గమని, ప్రతి ఒక్కరు సేవా మార్గంలో నడవాలని స్ఫూర్తి బృందం సభ్యులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భాస్కర్, మారెళ్ల వాసు, హుమయున్, మోహన్ రెడ్డి, లలిత హోటల్ శివ, సాయి, రాజా హర్షవర్ధన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కురువ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గా కురువ రామకృష్ణ నియమకం

విభారి న్యూస్ నవంబర్ 12. కర్నూలు ప్రతినిధి రాష్ట్ర కురువ కురుబ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గా గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామానికి చెందిన కె రామకృష్ణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ నన్ను గుర్తించి కురువ కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కి కర్నూల్ పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నకి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి. వి జయ నాగేశ్వర్ రెడ్డి కి రాష్ట్ర డైరెక్టర్ గా ఎన్నికైన కురువ రామకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు తనకు ఇచ్చిన పదవినిబాధ్యతగా నిర్వహిస్తానని తెలియజేశారు



# పోసానికి చుట్టుముడుతున్న కేసులు

రాజమండ్రి, నవంబర్ 12, పోసాని కృష్ణమురళి.. సినిమాల్లో మల్టీ రోల్స్ పోషించి సక్సెస్ అయ్యారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్, హీరో, రైటర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఇలా విభిన్న రూల్స్‌లో తనని తాను నిరూపించుకున్నారు. ఇండస్ట్రీలో కెరీర్ కంఫర్టబుల్‌గా ఉన్న టైంలోనే ఆ కాంట్రావర్సీ నటుడుకి రాజకీయాలపై ప్రేమ పుట్టుకొచ్చింది . 2009 ఎన్నికల ముందు ప్రజారాజ్యంతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో మొట్టమొదట సారి ఎమ్మెల్యేగా కూడా పోటీ చేశారు. చిలకలూరిపేట పీఆర్పీ అభ్యర్థిగా పోటీ చేసి తనకు ఎలాంటి పొలిటికల్ ఇమేజ్ లేకపోయినా? చిరంజీవి పుణ్యాణ 14 వేల ఓట్లు మాత్రం దక్కించుకుని మూడోస్థానంతో సరిపెట్టుకున్నారువైసీపీ స్థాపన తరువాత పోసాని కృష్ణ.. జగన్ పంచకు చేరారు. జగన్ పాదయాత్రలోనూ పాల్గొన్నారు. అయితే జగన్ మాత్రం 2014 నుంచి 2024 వరకు ఏ ఎన్నికల్లోనూ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. అయినా 2019 ఎన్నికల సమయంలో జగన్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇండస్ట్రీలో మెంటల్ కృష్ణగా పేరున్న పోసాని నోటి దూకుడు నచ్చి తాను అధికారంలోకి వచ్చాక జగన్ ఏపీ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హోదా కట్టబెట్టారు. ఇక అప్పటి నుంచి పోసాని నోటికి అడ్డు అదుపులేకుండా పోయిందన్న విమర్శలున్నాయివైసీపీ బూతు నేతల కంటే ఎక్కువగా చంద్రబాబు, పవన్‌లను టార్గెట్ చేశారు .. తాను కమ్మ సామాజికవర్గానికి చెందిన వాడినని చెప్పుకుంటూనే.. కులాన్ని కించపరిచేలా మాట్లాడం, చంద్రబాబు కులాని వాడుకుంటున్నారని విమర్శించడం ఆయనకే చెల్లింది. ఆ క్రమంలో విపరీతంగా బూతు ప్రయోగాలు కూడా చేసి తీవ్ర వివాదాల్లో చిక్కుకున్నారు.ఇక మెగా ఫ్యామిలీపై ఆయన విమర్శలకు హద్దుపొద్దూ లేదంటారు. ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్, మెగాస్టార్ చిరంజీవిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పవన్ కల్యాణ్ సభలకు వచ్చే జనం ఎవరూ ఓట్లు వేయరని.. పవన్ కల్యాణ్ ఓ మెంటల్ కేసని ప్రెస్ మీట్లు పెట్టి మరీ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అసలు మెగా ఫ్యామిలీ పైసల కోసమే పార్టీలు పెట్టిందని తీవ్ర ఆరోపణలు గుప్పించారు.పవన్‌పై పోసాని చేసిన విమర్శలతో అప్పట్లో జనసైనికులు, వీర మహిళలు పలు కేసులు పెట్టారు. అయితే వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులను వాటిని పట్టించుకోలేదు. అయితే వీర మహిళల పోరాటంతో రాజమండ్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2022లో ఆయన పైన పలు సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన వీర మహిళ ఇందిర గతంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దాన్ని పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు పోసానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఆ వ్యవహారం పెద్ద సంచలనంగా మారింది.కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పటి దాకా నోటికి పనిచెప్పిన పలువురు వైసీపీ సీనియర్లు సైలెంట్ అయ్యారు. మెంటల్ కృష్ణ మాత్రం నోటి దూకుడు కంటిన్యూ చేస్తూనే ఉన్నారు. లడ్డూ వివాదం, డిక్లరేషన్ రగడ, జగన్ తిరుమల పర్యటన రద్దు తదితర అంశాలపై పోసాని కృష్ణమురళి అప్పట్లోతీవ్రంగా స్పందించారు. సీఎం చంద్రబాబు టార్గెట్ గా తీవ్ర వ్యాఖ్యలు చేశారు . అంతా కలిసి జగన్ ను

ఎందుకు ఇంతలా హింసిస్తున్నారని పోసాని ప్రశ్నించారు. జగన్ తిరుమలకు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణం అని బోల్డు ఆవేదన వ్యక్తం చేశారుపనిలోపనిగా జగన్ కు ప్రాణగండం ఉందని పోసాని సంచలన ఆరోపణలు చేశారు. దయచేసి జగన్ ను మాత్రం మర్డర్ చేయించమాకు, మీకు పెద్ద హిస్టరీ ఉంది నాకు తెలుసు.. అంటూ చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారాయన. ఎప్పుడు పోతామో ఎవరికి తెలుసు, అయినా భయపడేది లేదని హీరోయిజం ప్రదర్శించారు.రాష్ట్రంలో పొలిటికల్ సీన్ మారినా పోసాని మాత్రం దూకుడు తగ్గించడం లేదు. అదే ఆయన మెడకు చుట్టుకునేలా కనిపిస్తుందంటున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ, జనసేన అధినేతల్ని ఇష్టమె?చ్చినట్లు తిట్టిన వారిపై పాత కేసులను పోలీసులు తిరగదోడుతున్నారు. వరుసగా అరెస్టులు కూడా జరుగుతున్నాయి. ఆధారాలతో కేసులు పెడితే చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారుల ప్రకటిస్తున్నారు. ఇటు పోసానిపై నోరు పారేసుకున్నందుకు ఇప్పటికే పెండింగ్ కేసులు ఉన్నాయి.ప్రాధాన్యతా క్రమంలో పోసాని పాతకేసు ఫైళ్లు ఎప్పుడైనా దుమ్ము దులపవచ్చంటున్నారు. ఇక ఓటమి తర్వాత కూడా ఆయన నోటికి పనిచెప్తుండటంతో కొత్త కేసులు నమోదైతే ఆయన పరిస్థితి ఏంటన్న చర్చ నడుస్తుంది. ఇప్పటికే మెగా ఫ్యామిలీపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఇండస్ట్రీలో తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్న పోసాని మున్ముందు సిల్వర్‌స్క్రీన్‌పై కనిపిస్తారా? లేదా ? అన్నది డౌటే. ఇక పదిహేనేళ్ల రాజకీయ జీవితంతో ఏమన్న సాధించారా అంటే పదేళ్లు ఆయన నోటిని వాడుకున్న జగన్ కనీసం టికెట్ కూడా ఇవ్వలేదు. ఇక ఇప్పుడు కేసుల చట్రంలో ఇరుక్కుంటే మెంటల్ కృష్ణకి అండగా నిలిచేదెవరు?.. అదే ఇప్పుడు రెండు ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్ గా మారింది

# మండలికి వెళ్లి... అసెంబ్లీకి డుమ్మాతో...

**వైసీపీ సాధించేదేమిటీ**

నెల్లూరు, నవంబర్ 12,వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎప్పుడూ రాంగ్ డెసిషన్ తీసుకుంటారు. సలహాదారులు ఎవ్వరో కానీ ఆయనకు పూర్తిగా రాజకీయం వంటబట్టలేదని అంటారు దగ్గర నుంచి చూసిన వాళ్లు. ఎందుకంటే కీలకమైన సమయంలో జగన్ పక్కకు తప్పుకోవడాన్ని అందరూ తప్పు పడుతున్నారు. ప్రధానమైన ప్రజలకు అవసరమైన బడ్జెట్ సమావేశాలను బహిష్కరించి జగన్ సాధించిందేమిటి? అన్న ప్రశ్నకు ఆయన వద్ద సమాధానం మాత్రం లేదు. తమకు మాట్లాడే అవకాశం ఎటూ ఇవ్వరు కాబట్టి ముందుగానే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించి పెద్ద తప్పు చేశారని వైసీపీ నేతలే అభిప్రాయపడుతున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వెళ్లి అక్కడ కేటాయింపులపై నిరసన తెలియజేసి బయటకు వచ్చినా సరిపోయేది కదా? అని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. వైసీపీకి వాకౌట్ అన్న ఒక ఆప్షన్ ఉందని జగన్ కు అసలు తెలుసా? అని ప్రశ్నిస్తున్నారు. తాను ముందుగానే ఊహించుకుని తనకు మాట్లాడే అవకాశం ఇవ్వరని తనకు తాను ముందుగా అంచనా వేసుకుని బహిష్కరిస్తానని ప్రకటించడం ఎంతవరకూ కరెక్ట్ అని వైసీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. మాట్లాడేందుకు సరైన అవకాశం ఇవ్వకపోతే అప్పుడే నిరసన తెలిపి అసెంబ్లీ నుంచి బయటకు వస్తే హుందాగా ఉండేదని, ముందుగానే సమావేశాలను బహిష్కరించడమేంటని కొందరు సోషల్ మీడియాలో జగన్ నిర్ణయాన్ని దుమ్మె?త్తిపోస్తున్నారు. ఒకవైపు శాసనమండలిలో జరిగే సమావేశాలకు హాజరవుతూ ఇటు అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం వైసీపీ ద్వంద వైఖరికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. శాసనమండలిలో తమకు బలం ఉండటంతో సమావేశాలకు హాజరు కావడంతో పాటు బలం లేని చోటకు గైర్హాజరవ్వడం ఎందుకని? ఎక్కడైనా తమ వాయిస్ ను వినిపించేందుకు ప్రయత్నించాలని, ప్రజా సమస్యలపై గళమెత్తి చాటాలని, అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని జగన్ కు హితవు చెబుతున్నారు. కేవలం పదకొండు మంది సభ్యులున్నంత మాత్రాన ప్రతిపక్షంగా శాసనసభ గుర్తించకపోయినా... హాజరయి తమ గళం వినిపించి ఉంటే ప్రజలు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చి ఉండేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మొత్తం మీద జగన్ తీసుకున్న నిర్ణయం పార్టీలోనే వివాదానికి కారణమయిం

# 2500 డిగ్రీలతో సిక్కోలు వాసి

శ్రీకాకుళం, నవంబర్ 12, ఏకంగా రెండేళ్ల పాటు నిరంతరాయంగా ఆన్లైన్లో ప్రపంచ నలుమూలల్లో ఉన్న ప్రఖ్యాత సంస్థలు అందిస్తున్న కోర్సులు 2,500 పూర్తి చేసి ప్రపంచ రికార్డును సిక్కోలు వాసి సొంతం చేసుకున్నారు. భారత ప్రభుత్వం సైబర్ నేరాలపై అవగాహన కలిగించేందుకు ఆన్లైన్లో ఉచితంగా కోర్సును ప్రవేశపెట్టినప్పుడు తమ కుమార్తెకు బోధించేందుకు శ్రీకాకుళం నగరానికి చెందిన ఎం.వి.ఎస్.ఎస్. శాస్త్రి ఆ కోర్సు చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణులై ధ్రువపత్రాలు పొందారు. ఆ తరువాత ఉచితంగా ఆన్లైన్ కోర్సులు అందిస్తున్న సంస్థలు వివరాలను సేకరించడం పనిగా పెట్టుకొని ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 2,500 ఆన్ లైన్ కోర్టులను రెండేళ్ల పాటు చదివి, పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రపంచ రికార్డులు నెలకొల్పడం విశేషం. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసినప్పుడు అన్ని సంస్థలు ఆన్లైన్లో కోర్సులను బోధించడం ప్రారంభించాయి. ఉచితంగా లభిస్తున్న ఆన్లైన్ కోర్సులు పట్ల ఆసక్తి కలిగి సరదాగా మొదలుపెట్టిన ప్రయత్నం విజయవంతం కావడంతో చదవాలనే ఆకాంక్ష, ఆసక్తి పెరిగిందన్నారు. ఈ క్రమంలోప్రతిరోజూ నాలుగు నుంచి ఆరు గంటల సేపు ఆన్లైన్ కోర్సులు చదవడం ప్రారంభించానని శాస్త్రి తెలిపారు. 2022 అక్టోబర్లో మొదలైన చదువుల యజ్ఞం నేటివరకు కొనసాగిస్తూనే ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో పేరొందిన సంస్థలతో పాటు మన దేశంలోనూ పలు విశ్వవిద్యాలయాలు అందించిన ఉచిత ఆన్లైన్ కోర్సులను పూర్తి చేసిన క్రమంలో మిత్రుల సూచనలు మేరకు రికార్డు సంస్థలకు వివరాలు సమర్పించినట్లు తెలిపారు. వృత్తిపరంగా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే క్రమం తప్పకుండా ఆన్లైన్ కోర్సులు పూర్తి చేసి ప్రపంచ రికార్డులు నమోదు చేయడం ఆనందంగా ఉందని శాస్త్రి తెలిపారు.నేటి పోటీ ప్రపంచంలో యువత ఏ కోర్సు చదివినప్పటికీ నైపుణ్యాన్ని పెంపొందించుకొనేందుకు ఆన్లైన్లో ప్రపంచం నలుమూలలనుంచి ప్రఖ్యాత సంస్థలు ఉచితంగా అందిస్తున్న కోర్సులు సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన సూచించారు. సాధించాలన్న తపన, పట్టుదల, నిరంతర ప్రయత్నంతో విజయం సాధించగలమనడానికి తన చదువుల ప్రస్థానమే నిదర్శనమని శాస్త్రి తెలిపారు.

ప్రత్యేక శిక్షణలు... సాఫ్ట్వేర్ రంగంలో పేరొందిన గూగుల్ పాటు టీసీఎస్, మైక్రోసాఫ్ట్ ప్రవేశపెట్టిన ఛాలెంజ్, ట్రైనింగ్ కోర్సులను పూర్తి చేసి వాటి నుంచి ప్రత్యేక అభినందనలను పొందారు. టీసీఎస్ డిజిటల్ సూపర్ స్టార్ ట్రైనర్, మైక్రోసాఫ్ట్ గ్లోబెల్ అకాడమి, మైక్రోసాఫ్ట్ టీచర్ అకాడమి నుంచి ప్రశంసలను శాస్త్రి పొందారు.ఆన్లైన్లో 2,500 కోర్సులు రెండేళ్ల పాటు చదివి పూర్తి చేసిన ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా అచీవర్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు (రెండు తెలుగు రాష్ట్రాలు) సొంతం చేసుకున్నారు. అత్యధికం గా ఆన్లైన్లో కోర్సులు పూర్తి చేసిన వ్యక్తిగా శాస్త్రి పేరు నమోదు చేసి ధ్రువపత్రాలను రికార్డు సంస్థలు ప్రదానం చేశాయి. గిన్నిస్ రికార్డు నమోదుకు దరఖాస్తు సమర్పించగా.. ఆ బృందం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టింది.ఆన్లైన్ అంతర్జాతీయ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఐబీఎం, లింక్డ్న్, ఫేస్బుక్, మెటా, ఆటోడెస్క్, ఓషా, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్, కార్పొరేట్ ఫైనాన్స్ ఇనిస్టిట్యూట్, యుడేమి, ఈడీఎక్స్, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్వో), ఇంటర్నేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఐటీసీ), యూరోపియన్ ఓపెన్ యూనివర్శిటీ, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో), యునిసెఫ్, కోర్సుఎరా, కర్సా, యూకే అకాడమి, ఫ్యూచర్ లెర్న్, ఒరగాన్ (యుఎస్ఏ) యూనివర్శిటీ, ఫోర్ఎజ్, యాక్సెంచర్, వాల్మార్ట్, యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్, యూనివర్శిటీ ఆఫ్ మెల్బోర్న్, బ్రిటిష్ కౌన్సిల్, న్యూసౌత్వేల్స్ (ఆస్ట్రేలియా) యూనివర్శిటీ, బ్రిటిష్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, డిలైట్, కాగజెంట్, ఆక్ ఫర్డ్ హె?మ్ స్టడీ, అలిసన్, లెక్ట్రా. గ్యాస్పల్ ఇనిస్టిట్యూట్, ఓపెన్ లెర్నింగ్, మైండ్లస్టర్ సంస్థల నుంచి సాఫ్ట్వేర్ కి సంబంధించిన కోర్సులతో పాటు స్కిల్ డెవలప్మెంట్, బిజినెస్ మేనేజ్మెంట్, సైకాలజీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మిషన్ లెర్నింగ్.. విద్యారంగంలో ఉన్న అన్ని విభాగాలకు చెందిన కోర్సులు పూర్తి చేయడం విశేషం.గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ), ఐఐటీ మద్రాస్, ఎన్ పి టి ఈ ఎల్. లాల్బహుదూర్ శాస్త్రి యూనివర్శిటీ, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్ .పి, డిజిటల్ అడ్డా, సింప్లీలెర్న్, ట్రిపుల్ ఐటీ (కోటా) రాజస్థాన్, ఫార్మా అకాడమి, యుడెనెక్స్, గువీ, హెచ్ సి ఎల్, నాస్కామ్, స్కిల్ అప్, సిస్కో, ఎక్సెల్ చాంప్, పిట్రోనిక్స్, లెట్స్ అప్ గ్రేడ్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇంటెల్, ఎనర్జీ స్వరాజ్, యాక్సెస్ బ్యాంక్, ట్యుటోరియల్ పాయింట్ తదితర సంస్థలు నుంచి కోర్సులు, ధ్రువపత్రాలు పొందారు .ప్రఖ్యాత మెటా సంస్థ వాట్సాప్ లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)ను ప్రవేశపెట్టిన క్రమంలో జిల్లాకు చెందిన పలు చారిత్రక అంశాలతో కూడిన సమాచారాన్ని మెటా ఏఐకు శాస్త్రి నిరంతరం అందిస్తున్నారు. మెటా సంస్థ వాట్సాప్లో నీలిరంగు ఐకాన్తో ఏఐను ప్రవేశపెట్టిన క్రమంలో జిల్లాలో పలు విశేషాలు, సమాచారాన్ని ఏఐకు అడిగినప్పుడు సరైన సమాచారం లభించలేదు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ సమాచారం, ప్రస్తుత పరిస్థితులను ప్రతిరోజూ ఒక గంటసేపు మెటా ఏఐకు అందించే పని శాస్త్రి చేస్తు న్నారు. జిల్లాకు చెందిన సమాచా రాన్ని ఎవరైనా శోధించినప్పుడు పక్కాగా ఫలితం రావాలనే తాను ఏఐకు శాస్త్రీ యంగా కూడిన సమా చారాన్ని ఉచితంగా అందిస్తున్నానని ఆయన తెలిపారు

# వలసలు వెళ్లకుండా నివారణ చర్యలు

కౌతాళం,గ్రామ ప్రజలకు వలసలు వెళ్ళకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ పేర్కొన్నారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం కౌతాళం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం లో వారు మాట్లాడుతు ప్రజలకు వలసల నివారణకై గ్రామ సర్పంచ్ ప్రజలకు గ్రామ పంచాయితి కార్యాలయం నందు 2005- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే వారికి రోజుకు 300/- రూ కూలీ తగ్గకుండా వస్తుంది. వారు సద్వినియం చేసుకోవాలని గ్రామ ప్రజలకు ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ దినకర్ పంచాయతీ కార్యదర్శి బి.శివప్ప మరియు ఏ పి ఓ మాధవ శంకర్ మరియు టి ఏ మద్రియ్యప్ప మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

# రైతన్నలకు వరప్రదాయని సేంద్రియ ఎరువులు

**సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలపై అవగాహన సదస్సు**

**షణ్ముఖ అగ్రిటెక్ సంస్థ అసిస్టెంట్ ఏరియా సేల్స్ మేనేజర్ నరసింహారావు**

**సేల్స్ ఆఫీసర్ రవీంద్రబాబు**

ఆళ్లగడ్డ,సేంద్రియ ఎరువులు తద్వారా వాటి ప్రయోజనాలపై రైతన్నలకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మంగళవారం పల్నాడు జిల్లా వినుకొండ మండలం నీళ్ల గంగవరం గ్రామంలో రైతు సోదరులకు షణ్ముఖ అగ్రిటెక్ సంస్థ అసిస్టెంట్ ఏరియా సేల్స్ మేనేజర్ నరసింహారావు సేల్స్ ఆఫీసర్, రవీంద్రబాబు, మార్కెటింగ్ ఇన్చార్జి బిల్లా నవీన్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో వారు రైతులతో మాట్లాడుతూరైతులు సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమి సారవంతంగా తయారవ్వటమే కాక పంటలఅధిక దిగుబడి పేరిగి రైతన్నలు అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. షణ్ముఖ అగ్రిటెక్ లిమిటెడ్ సంస్థ రైతుసోదరులకుగత14సంవత్సరాలుగానాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ అధిక దిగుబడులు సాదించేలా కృషి చేస్తున్నారని తెలిపారు. మా యొక్క ఉత్పత్తులైనవామ్ గోల్డ్, కింగ్ జైమ్, వసుధ గ్రాను లెస్,టెర్మినేటర్ 11, తేజస్ ప్లస్,తేజల్ ,మోక్ష ,గార్డియను, సూక్ష్మ పోషకాలైన భాగ్య ,భాగ్యమ్యాక్స్, సేంద్రీయ ఎరువులైన కీ అంతగాకుండా జీవ సస్యరక్షకాలైన అలాగే ఏకలవ్య వాడి అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు తెలియచేసారు. రైతన్నలు రసాయనిక ఎరువులు వాడటం పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూమిలో సారం తగ్గడంతో పాటు రైతులు ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందన్నారు. ఈ విషయం భూసార పరీక్షల్లో వెల్లడైందన్నారు కావున సేంద్రియ ఎరువులు వాడటం వల్ల రైతులకు తక్కువ పెట్టుబడి తో భూమిసారవంతంగాతయారవ్వడమే కాక పంట దిగుబడి అధికంగా వచ్చి రైతులు అధిక లాభాలు పొందుతారన్నారు.మంగళవరం నీలగంగవరం గ్రామం వినుకొండ మండలం వ్యవసాయ పంట పొలాల్లో పర్యటించి రైతులకు మిర్చి వరి, కురగాయల పంటల పై వచ్చే చీడపీడల గురించివివరించడం జరిగిందన్నారు. కంపెనీ ఉత్పత్తులను గురించిరైతులకు తెలియజేసారు. ఈకార్యక్రమంలో సేల్స్ ఆఫీసర్ వి.రవీంద్రలు సీనియర్లు డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ ; బిల్లా నవీన్ , పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అందెశ్రీకి లోక్ నాయక్ పురస్కారం

విశాఖపట్నం,ఏటా నిర్వహిస్తున్న విశాఖ లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవం ఈ ఏడాది కూడా నిర్వహించేందుకు సిద్దమైంది.సుప్రసిద్ధ తెలుగు రచయిత అందెశ్రీకి పురస్కారాన్ని అందిస్తున్నట్లు అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విశాఖలో ప్రకటించారు.జనవరి 18 న సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నామని,దీనికి ముఖ్యఅతిదిగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా వస్తున్నారని,గత 20 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# ప్రజలను దగా చేసిన చంద్రబాబు సర్కార్

కడప,రాష్ట్ర ప్రజలను చంద్రబాబు సర్కార్ దగా చేసిందంటూ వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికలప్పుడు కూటమిగా ఏర్పడి ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే వెంటనే వాటిని అమలు చేస్తామని ఓటు అడిగారు. మహిళకు 15 వేలు, ఉచిత బస్సు, నిరుద్యోగులకు 3వేల భృతి ఇస్తామన్నారు. 20 వేలు రైతుకు, 25 లక్షల ఉద్యోగాలు ఇలా అనేకం సూపర్ సిక్స్, మేనిఫెస్టో ఉన్నాయి. గెలిచిన వెంటనే అమలు చేస్తామని వాగ్దానం చేశారు. 6 నెలలు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో కాలయాపన చేశారు. నిన్న పూర్తి బడ్జెట్ పెట్టారు.. దాంట్లో మీరిచ్చిన ఈ ఒక్క హామీ కనిపించలేదంటూ రామమల్లు నిలదీశారు. ?

# అసెంబ్లీ ఫుడ్ కాంట్రాక్టర్ మార్పు

అమరావతి, అసెంబ్లీ భోజనంపై నిన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. సభ్యులకు వేరుగా, ఇతరులకు వేరుగా భోజనం పెట్టారా అంటూ నిలదీసారు. అందరికీ ఒకేలా భోజనం పెట్టామని అధికారులు వివరణ ఇచ్చారు. ఒకేలా భోజనం పెడితే నేనెందుకు నిలదీస్తానన్న సభాపతి అన్నారు. తనకు ఫిర్యాదులు ఎందుకొచ్చాయో సమాధానం చెప్పాలని అయ్యన్నపాత్రుడు అన్నారు. పదార్థాలు ఒక్కటే కానీ అన్నం ఒక్కటే మారిందని అధికారులు వివరణ ఇచ్చారు. అసెంబ్లీ అంటే తమాషా అనుకుంటున్నారా అంటూ అధికారులు, కాంట్రాక్టర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఫుడ్ సరఫరా చేసే పాత కాంట్రాక్టర్ ను మార్చివేసారు. ఇవాళ్టి నుంచే కొత్త ఫుడ్ కాంట్రాక్టర్ కు భోజనం సరఫరా చేసే బాధ్యత అప్పగించారు. ఇవాళ అసెంబ్లీ హాలులో ఎమ్మెల్యేలకు శిక్షణ అనంతరం మధ్యాహ్నం కొత్త కాంట్రాక్టర్ భోజనం ఏర్పాటు చేసారు.

# సోషల్ మీడియాలో పోస్టులు... సంచలనాలు

**తాడేపల్లి ప్యాలెస్ నుంచే గైడెన్స్**

విజయవాడ, నవంబర్ 12, వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్ రెడ్డిని పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ కేసు వివరాలను డీఐజీ కోయా ప్రవీణ్ వివరిస్తూ...రాక్షస జాతి చెందిన వారే ఇటువంటి భాషను వాడతారన్నారు. చంద్రబాబు,పవన్, వారి కుటుంబ సభ్యులపై అత్యంత నీచమైన భాషలో పోస్టులు పెట్టారన్నారు.తాడేపల్లి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకే వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్ రెడ్డి.. అసభ్యకర పోస్టులు పెట్టినట్లు కర్నూలు రేంజ్ డీఐటీ కోయా ప్రవీణ్ తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, ఇతర నేతలపై అసభ్యకర పోస్టుల కేసులో నిందితును అరెస్టు చేసేందుకు పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపడతున్నాయని డీఐటజీ కోయా ప్రవీణ్ తెలిపారు. చంద్రబాబు, పవన్, అనితపై అనుచిత పోస్టుల కేసులో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు నిందితులు సుబ్బారెడ్డి, ఉదయ్‌లను అరెస్టు చేశామన్నారు. వీరిని పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఐజీ కోయా ప్రవీణ్, కడప ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీడియాకు తెలిపారు.రాక్షస జాతికి చెందిన వ్యక్తుల తరహాలో చాలా అసహ్యామైన భాషలో చంద్రబాబు, లోకేశ్, పవన్ కుటుంబ సభ్యుల గురించి వర్రా రవీందర్ రెడ్డి పోస్టులు పెట్టారని పోలీసులు తెలిపారు. వర్రా రవీందర్ రెడ్డిని సోషల్ మీడియా అకౌంట్ నుంచి మూడు విధాలుగా పోస్టులు పెడుతున్నారు. వర్రా సొంతంగా కొన్ని పోస్టులు పెడితే..తాడేపల్లి కార్యాలయం నుంచి కొన్ని పోస్టులు, ఎంపీ అవినాష్ రెడ్డి పీవీ పంపిన కొన్ని పోస్టులు పెట్టారన్నారు. షర్మిల, వైఎస్ సునీతారెడ్డిపై పెట్టిన పోస్టులు అవినాష్ రెడ్డి పీఏ పంపినట్లు గుర్తించామన్నారు. అవినాష్ రెడ్డి పీఏ వాట్సాప్ నెంబర్ నుంచి వర్రా రవీందర్ రెడ్డికి ఈ పోస్టులు వచ్చాయన్నారు. అవినాష్ రెడ్డి చెబుతుంటే ఆయన పీఏ ఈ వివరాలు రాసుకుని...వర్రాకు పంపేవారని తెలిసిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. అలాగే వైఎస్ సునీతారెడ్డి హైదరాబాద్ లో ఫిర్యాదు చేశారని, ఆమె ఏపీలో ఫిర్యాదు చేస్తే ఈ విషయంపై మరింత దర్యాప్తు చేస్తామన్నారు."సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై నిందితులు వాడిన భాష చాలా అసభ్యకరంగా ఉంది. అరబ్ దేశాల్లో అయితే వీరికి తీవ్ర శిక్షలు ఉంటాయి. వర్రా రవీందర్ రెడ్డి గతంలో భారతి సిమెంట్స్‌లో పనిచేశాడు. ఈ కేసులో అరెస్టైన మరో ఇద్దరు కూడా వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్నారు. డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులను వైసీపీ అనుకూలంగా వాడుకుని ప్రత్యర్థులపై పోస్టులు పెట్టారని నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. వీరిలో కొందరు జడ్జిలకు వ్యతిరేకంగా కూడా పోస్టులు పెట్టారు. ఇలాంటి వారిని 45 మందిని గుర్తించారం. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు పెట్టాం. నిందితులు రాక్షస జాతికి చెందిన వాళ్లలా పోస్టులు పెట్టారు. కుటుంబ సభ్యులు, పిల్లల గురించి అత్యంత నీచమైన భాషలో పోస్టులు పెట్టారు"- డీఐజీ కోయా ప్రవీణ్నిందితులకు 40 యూట్యూబ్ ఛానెళ్లు ఉన్నట్లు గుర్తించామని డీఐజీ ప్రవీణ్ తెలిపారు. నాయకుల ఫొటోలు మార్ఫింగ్ చేసి అనుచితంగా వీడియోలు, పోస్టులు పెట్టేవారన్నారు. వీరికి తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం నుంచి మార్గనిర్దేశం చేసేవారన్నారు. తాడేపల్లిలోని పీవీఆర్ ఐకాన్ బిల్డింగ్ నుంచి వచ్చిన పోస్టులు వీరు సోషల్ మీడియాలో పెట్టేవారు.

# శ్రీ అమ్మవారిని దర్శించుకున్న హీరో వరుణ్ తేజ్

విజయవాడ,మంగళవారం నాడు నటుడు వరుణ్ తేజ్, యు బృందం అమ్మవారి ఆలయానికి వచ్చారు. వారికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు.. తరువాత వారికి ఆలయ ఈవో కె.ఎస్ రామరావు, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించి, అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం మరియు చిత్రపటం అందజేశారు.

# కార్యకర్తలకు అండగా వుండే పార్టీ వైయస్ఆర్ సిపి పార్టీ



విభారె న్యూస్ నవంబర్ 12 ఎమ్మిగనూరు..మంగళవారం ముగతి గ్రామానికి చెందిన వైయస్ఆర్ సిపి గృహ సారథి సత్య రెడ్డి సతీమణి సొమేశ్వరమ్మ,కుమారుడు హరికృష్ణ పార్టీ కార్యాలయం నందు వైయస్ఆర్ సిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి బుట్టా రేణుక కి శాలువా కప్పి పోష్పగుచ్చం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీమతి బుట్టా రేణుక మాట్లాడుతూ ఆనాడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పార్టీ బలోపేతానికి కృషి చేసిన వైయస్ఆర్ సిపి వార్డు కన్వీనర్/గృహ సారదుల శ్రేయస్సు కొరకు 5 లక్షల రూపాయల భీమాని కన్వీనర్/గృహ సారదుల పేరున భీమా చెయ్యడం జరిగిందిని. అందులో భాగంగానే ముగతి గ్రామ వైయస్ఆర్ సిపి గృహ సారథి సత్య రెడ్డి అనారోగ్యంతో 26.02.2024 తేదిన మృతి చెందిన సత్య రెడ్డి కుటుంబ సభ్యుల ఖాతాలో 5 లక్షల రూపాయలు భీమా నగదు జమ కావడం జరిగిందని అందుకే సత్య రెడ్డి కి కుటుంబసభ్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి ధ్యవాదములు తెలిపారు అని ఆమె తెలియజేశారు. ఈ కార్యమంలో నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు వీరుపాక్షి రెడ్డి, మాజి ఎల్ ఎల్ సి డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి,నందవరం మండల వైయస్


### పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు విరాళంగా అందజేసిన గణిత ఉపాధ్యాయుడు కె ఎం నాగేంద్ర కుమార్..



విభారె న్యూస్ నవంబర్ 12 నందవరం. నందవరం మండలము కనకవీడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు గా పనిచేస్తున్న నాగేంద్ర కుమార్ తన పాఠశాల విద్యార్థుల కోసం,ఒక అనాదాశ్రమం లోని విద్యార్థుల కోసం మంగళవారం రోజు 38 వేల రూపాయల విలువ చేసే 400 భోజనం ప్లేట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ కి అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది అందరూ పాల్గొనడం జరిగింది.

## మంగళవారం పురస్కరించుకొని శ్రీ జమ్ములమ్మ దేవికి ప్రత్యేక అలంకరణ..

విభారె న్యూస్ నవంబర్ 12 ఎమ్మిగనూరు. స్థానిక శ్రీ జములమ్మ దేవి ఆలయంలో మంగళవారంలో పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలను నిర్వహించారు. ఆలయ పూజ కార్యక్రమాలన్నీయు ఆలయ ధర్మకర్త తట్టే బుడ్డప్ప వారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలన్నీ నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు.



# సీసీ రోడ్లను శరవేగంగా పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల బ్యూరో నవంబర్ 12-పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన 1026 సిసి రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సిసి రోడ్ల నిర్మాణ పనులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఈఈ రఘురామిరెడ్డి, డిఈ, ఏఈలు, సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే నంద్యాలలో 101 పనులకు గాను 20 పనులు గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 5 పనులు, పాణ్యం నియోజకవర్గంలో 71 పనులకు గాను 24 గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 3 పనులు, శ్రీశైలంలో 162 పనులకు గాను 34 గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 9 పనులు, బనగానపల్లెలో 145 పనులకు గాను 75 పనులు గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 8 పనులు, డోన్ లో 64 పనులకు గాను 23 పనులు గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 3 పనులు, నందికొట్కూరులో 236 పనులకు గాను 56 గ్రౌండింగ్ అయ్యాయని రోజుకు 12 పనుల చొప్పున ప్రతిరోజు 50 పనులు గ్రౌండింగ్ కావడంతో పాటు ఇదివరకే చేపట్టిన 50 నిర్మాణ పనులు పూర్తికావాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 23 వ తారీఖున పూర్తి అయిన పనులను స్థానిక ప్రజాప్రతినిధులచే ప్రారంభోత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ నెలాఖరులోగా ఇసుక డిపోలకు మినరల్ డిపో లైసెన్స్ లు మంజూరు చేసి ఇసుక స్టాక్ పెడతామని బల్క్ బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాల ప్రగతికి సంబంధించి ప్రతి గురువారం కేటాయించిన లక్ష్యం పైననే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రగతిని సమీక్షిస్తానన్నారు. చేపట్టిన నిర్మాణ పనులపై నిఘా ఉంటుందని సీఎం గారు ప్రత్యక్షంగా పర్యవేక్షించి సమీక్షించే అవకాశం ఉందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సిసి రోడ్ల నిర్మాణ పనులను చాలెంజె గా తీసుకొని లక్ష్యాన్ని మించి అధిగమించాలని కలెక్టర్ ఆదేశించారు.

# వరి కోసిన తర్వాత అపరాల పంటలు వేయండి

### వ్యవసాయ అధికారి ప్రసాద రావు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 12- వరి పంట కోసిన తర్వాత అపరాల పంటలు వేసుకోవాలని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు సూచించారు. మంగళవారం చాబోలు మరియు హై స్కూల్ కొట్టాల గ్రామాల లో మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు ఆధ్వర్యములో పొలంపిలుస్తోంది కార్యక్రమము నిర్వహించారు . కార్యక్రమంలో హై స్కూల్ కొట్టాల గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి వైవి మురళి కృష్ణ పాల్గొని వ్యవసాయ శాఖ ద్వారా ప్రస్తుతం అమలు పరుస్తున్న పథకాలు గురించి రైతులకు వివరించారు . ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వైవి మురళి కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంట కోత దశలో ఉన్నదని వరి కోసిన తర్వాత రెండవ పంటగా అపరాలు అయిన మినుము లేదా పెసర లేదా అలసంద సాగు చెయ్యాలని దీని వలన భూమిలో చౌడు తగ్గి సారవంతంగా తయారవుతుందని, అలాగే ప్రస్తుతం రబీలో సాగైన జొన్న పంటను కాండం తొలిచే పురుగు మరియు కత్తెర పురుగు ఆశించడం జరిగింది అని వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇందుకు గాను ఎకరాకు 6-8 లింగార్షక బట్టలు, పంటలో అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నచో కార్బో ఫ్యురాన్ 8-10 కేజీ ల మొక్క సుడులలో వేసుకోవాలని లేదా ఐమా మెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ద్వారా రబీ పంట కాలం లో పంటల భీమా పథకం అమలు చేయడం జరుగుతుంది , ప్రస్తుతం రబీ 2024-25 కాను శనగ గ్రామ యూనిట్ గా, వరి, జొన్న, మినుము మండలం యూనిట్ గా , వేరు శనగ, ఉల్లి జిల్లా యూనిట్ గా పంటల భీమా పథకం లో చేర్చారని తెల్పారు. శనగ పంట రైతూ వాటా ఏకరానికి రూ 84/-, వరి కి రూ 126/-, జొన్న - రూ 59/-, మినుము - రూ 48/- రైతులు తమ వాటా ప్రీమియం అమౌంట్ కట్టుకోవడానికి వరి పంట డిసెంబర్ 31 లొపు, మిగతా పంటలకు డిసెంబర్ -15 ,లోపు నిర్ణయించడం జరిగిందనీ,తదుపరి వివరాలకు రైతు సేవ కేంద్ర సిబ్బంది నీ సంప్రదించాలన్నారు ఈ కార్యక్రమంలో ఎఈఓ ముక్తార్ భాష. మహేష్. రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగ హర్షిత. వైష్ణవి. రైతులు తదితరులు ఉన్నారు.

# విద్యార్థి అమరవీరులను స్మరించుకుంటూ విద్యార్థుల సమస్యలపై ఉద్యమిద్దాం.. పీడీయస్ యూ




విభారె న్యూస్ నవంబర్ 12 ఎమ్మిగనూరు. దేశంలోని పేద బడుగు బలహీన వర్గాలకు చెందినటువంటి విద్యార్థులందరికీ అసమానతలు లేని సమానమైన శాస్త్రీయమైన విద్య అందించాలని ఉద్యమంలో అసువులు బాసిన విద్యార్థి అమరవీరుల అయినా జార్జిరెడ్డి జంపాల చంద్రశేఖర ప్రసాద్ శ్రీపాద శ్రీహరి కోలాశంకర్ చేరాలు రంగవల్లి స్నేహాలత వంటి విద్యార్థి అమరవీరుల స్మరించుకుంటూ వారి యొక్క ఆశయా సాధనకు కృషి చేస్తూ ప్రభుత్వాలు విద్యార్థులపై అవలంబిస్తున్న విధానాలపై ఉద్యమించాలిని పీడీయస్ యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, టియుసీఐ జిల్లా నాయకులు తిరుపాలు పిలుపునిచ్చారు. అనంతరం కర్నూలు నగరంలో విద్యార్థి అమరవీరుల సభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసి విద్యార్థులకు నాణ్యమైనటువంటి విద్యను అందించడంలో విఫలమవుతున్నారన్నారు కొఠారి కమిషన్ ప్రకారం విద్యారంగానికి జాతీయ స్థూల ఉత్పత్తిలో 6% కేంద్ర బడ్జెట్ లో 10% రాష్ట్ర బడ్జెట్ లో 30% ఇవ్వాలని విద్యారంగానికి కేటాయించాలని ఉంది కానీ విద్యారంగంను పూర్తిగా విస్మరించింది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మానవతా విలువలు కలిగిన విద్యను అందించాలని ఆలోచన చేయకుండా విద్యను కాషాయికరణం చేయడానికి పూనుకుంది అని అన్నారు దేశంలో విద్యార్థులను సైతం మతం పేరుతో విచ్చిన్న కరంగా చేస్తున్నదిన్నారు, రాష్ట్రం కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉంది అంటూ విద్యారంగానికి బడ్జెట్ కేటాయించకుండా అవలంబిస్తుందని అన్నారు అధికారం రాకముందు పీజీ విద్యార్థులకు జీవో నెంబర్ 77 రద్దు చేసి ఫీజు నెంబర్స్ మెంట్ వారికి ఇస్తాం చెప్పి తీరా అధికారంలోకి వచ్చి ఈ విద్యా సంవత్సరం నుంచి ఇవ్వకుండా విద్యార్థులను మోసం చేశారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీసంక్షేమ హాస్టల్లో పక్క భవనాలు మెరుగైన వసతులు కల్పించకుండా కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది అన్నారు. ప్రభుత్వాల యొక్క విద్య వ్యతిరేక ఆలోచనలను తీపికొడుతూ విద్యార్థుల సమస్యల పై ఉద్యమిస్తు విప్లవ విద్యార్థి అమరవీరుల ఆశయాల బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పిడిఎస్ యు నాయకులు రాజు, అభి,సుధీర్,వెంకటేష్ లు పాల్గొన్నారు.

## పూడిక త్వరగా తొలగించాలి---




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 12-ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా పట్టణంలో చేస్తున్న పూడిక తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల ఆక్రమణలు తొలగించాం. కాలువపై ఎవరూ నిర్మాణాలు చేపట్టారాదన్నారు. దుకాణా దారులు కాలువ లపైన సామాగ్రిని ఉంచొద్దని అన్నారు. ఎవరైనా రోడ్లను కాల్వలను ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం అక్రమణల్ని తొలగిస్తున్నామని అన్నారు . కమిషనర్ వెంట శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ఆప్టా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా షణ్ముఖ రావు..


విభారె న్యూస్ నవంబర్ 12 కర్నూలు జిల్లా ప్రతినిధి..సోమవారం రాత్రి ఆన్ లైన్ లో జరిగిన ఎ. పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాల లో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పని చేయుచున్న జి షణ్ముఖ రావు ను ఆప్టా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. గతంలో ఉమ్మడి విశాఖ పట్టణ ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి గా విశాఖ జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ గా పని చేసిన షణ్ముఖ రావు ను రాష్ట్ర కార్యవర్గం లో తీర్మానం ఏకగ్రీవ అమోదం పొందబడి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర బడ్జెట్ యందు విద్యా శాఖ కు సంబందించిన కేటాయింపు ల గురించి రాష్ట్ర కార్యవర్గం హర్షం వ్యక్త పరిచారు. అయితే ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబందించిన పి ఆర్ సి, పెండింగ్ బకాయిలు గురించి యెటువంటి కేటాయింపు జరపక పోవటం గురించి విచారం వ్యక్తం



చేశారు. వెంటనే రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు పి ఆర్ సి,ఐ ఆర్, పెండింగ్ బకాయిలు పై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు రాష్ట్ర ముఖ్య మంత్రి ని పత్రిక ముఖంగా డిమాండ్ చేయటం జరిగింది.

### ఆళ్లగడ్డలో బర్డ్ మ్యాన్ ఇండియా జయంతి వేడుకలు

విభారె న్యూస్ నవంబర్ 12 ఆళ్లగడ్డ ప్రతినిధి :- బర్డ్ మ్యాన్ ఇండియా పద్మ విభూషణ్ గ్రహీత రాజ్యసభ సభ్యుడు సలీం మొయి జద్దీన్ అబ్దుల్ ఆలీ జయంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. అపుస్మ ఆళ్లగడ్డ నియోజవర్గం అధ్యక్షులు టి అమిర్ భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డంలోని ఏవిఆర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తో కలిసి భారత దేశ మొదటి పక్షి శాస్త్రవేత్త డాక్టర్ సలీం అలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమిర్ భాష మాట్లాడుతూ భారతీయ వన్యప్రాణుల పకృతి దృశ్యం మరియు భారతదేశంలోని పక్షుల జ్ఞానం మరియు ఆవాసాల గురించి భారతదేశ మొదటి పక్షి శాస్త్రవేత్త డాక్టర్ సలీం అలీ తన భార్య తెహిమినా వేగంతో పది సంవత్సరాలు భారతదేశ అంతట విస్తృత సర్వేలు చేసి బుక్ ఆఫ్ ఇండియన్ బర్డ్స్ రాసి 1941 వ సంవత్సరంలో ప్రపంచానికే అందించి భారతీయుల గుండెల్లో చిరస్మనీడిగా నిలిచిపోయాడన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం పక్షులను కాపాడుకోవడం భారతీయుల ప్రతి ఒక్కరి బాధ్యత డాక్టర్ సలీం అలీ మార్గదర్శి వారి ఆశయాలకు ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన ఘనమైన నివాళి వారు ప్రభుత్వం నుండి పద్మ విభూషణ్ పద్మభూషణ్ కాకుండా ఎన్నో అవార్డులు బ్రిటిష్ వారు కూడా అవార్డు ఇచ్చి గౌరవించిన గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ సలీం అలీ. అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, మునయ్య, కిషోర్, అమీర్, రవి, అంజలి, నిరోషా, శివ, పాపయ్య, అబ్దుల్, రెహమాన్, విజయ్ కుమార్, ప్రేమ్, శ్రావణి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190